# హవ్వ!...



ఆ రోజు ఆడిట్.

పదో గంటకల్లా ఆఫీసులో ఉండాలన్నాడు బాస్.

గబగబా నాలుగు మెతుకులు కతికి బస్టాఫ్‌కు బయలుదేరాను.

త్రోవలో రోడ్డు మీద స్పృహలేకుండా పడున్న వృద్ధుడొకడు కంటబడ్డాడు. ఎవరూ అతడిని గమనించినట్లు లేదు. చుక్క ఎక్కువైనట్లుందనుకున్నారు కొందరు. మరి కొందరు ఆ వ్యక్తి చనిపోయాడు కాబోలనుకుని 'పాపం' అంటూ చిల్లర విదిల్చి తమ సానుభూతిని కనబరుస్తున్నారు.

"తమరు దయగల బాబుల్లా ఉన్నారు. అంతా అనుకుంటున్నట్లు అతడు చనిపోలేదు. శోషొచ్చి పడిపోయాడు. మీరో చెయ్యివేస్తే ఇంటికి చేర్చవచ్చు' అన్నాడో ఆటోవాడు దగ్గరకొచ్చి.

'నీకు ఇతను తెలుసా? అడిగాను.

తెలుసునన్నట్లు తల పంకించాడు ఆటో వాడు.

వెంటనే నా వాటర్ బాటిల్ తెరచి అతడి మొహం మీద నీళ్లు చిలకరించాను. దాంతో అతడిలో కాస్త చలనం వచ్చింది. ఇరువురం కలిసి ఆ వృద్ధుణ్ణి మెల్లగా లేవనెత్తి ఆటోలో కూర్చోబెట్టి నేనూ పక్కన కూర్చున్నాను.

రోడ్డు మీద పడున్న చిల్లర ఏరి జేబులో కుక్కుకున్నాడు ఆటోవాడు.

వాడు చేస్తున్న పని నాకు నచ్చలేదు. అయినా నాకెందుకొచ్చిందిలే అనుకుని నోరు మూసుకున్నాను.

ఊరావతల చిన్న పాక ముందు ఆగింది ఆటో.

డ్రైవరు, నేను కలిసి ఆ ముసలాణ్ణి జాగ్రత్తగా నడిపించుకుంటూ లోపలకు తీసుకెళ్లి మంచం మీద పడుకోబెట్టాం.

'తాతా!' అంటూ ఏడుపు మొహం పెట్టాడు అక్కడున్న ఏడేళ్ళ కుర్రాడు.

ఆ పసివాణ్ణి చూస్తే నాకు జాలివేసింది.

"భయపడకు మీ తాతకు ఏం కాదు. ఎండకి శోషొచ్చి పడిపోయాడంతే" అన్నాను ఊరడింపుగా.

అంతలో ఆటోవాడు నా వంక చూసి "బాబూ! ఛార్జి చెల్లిస్తే వెళ్లిపోతాను" అన్నాడు ఎంతో వినయంగా.

"ఈయన నాకేమైనా బంధువా? నువ్వు సాయం చెయ్యమంటే చేసాను. డబ్బులు అడుగుతావేంటి?" అన్నాను వాడి మాటకు విస్తుపోతూ.

"ఇది మరీ బావుంది. ఆ ముసలాడు నాకుగాని చుట్టమనుకుంటున్నావా? అదేం కుదర్దు. మీ ఇద్దర్నీ నాలుగు మైళ్లు లాక్కొచ్చాను. బండికి పెట్రోలు ఎవరు పోస్తారనుకుంటు న్నావ్? మర్యాదగా వందరూపాయలిచ్చి మరీ కదులు అన్నాడు ఆటోవాడు.

వాడి నీచబుద్ధికి చీదరించుకుంటూ జేబులో నుంచి వంద కాగితం తీసి వాడి చేతిలో పెట్టాను.

వెళ్ళిపోయాడు ఆటోవాడు.

"ఎందుకైనా అవసరం ఉండొచ్చు ఈ డబ్బు ఉంచు" యాభై కాగితం ఒకటి తీసి పిల్లాడి చేతిలో పెట్టి వెనుదిరిగాను.

నెల రోజుల తర్వాత...

ఓ ఆదివారం ప్రదీప్‌నగర్‌లో ఉంటున్న మిత్రుణ్ణి కలిసి తిరిగొస్తుండగా త్రోవలో ఒక చోట జనం గుమిగూడి ఉండటం గమనించాను.

యాక్సిడెంటు కాబోలనుకుని అక్కడ మూగివున్న జనాన్ని ప్రక్కకు త్రోసి ముందుకెళ్లి చూసాను.

ఆశ్చర్యం...

నేను ఆ రోజు చూసిన వృద్ధుడే అక్కడ చలనం లేకుండా పడి ఉన్నాడు. అక్కడ చేరిన వారంతా అతడిపై సానుభూతి కురిపిస్తున్నారు. తమకు తోచిన విధంగా డబ్బులేస్తున్నారు.

అంతలో ఓ ఆటోవాడొచ్చి "ఈయన చనిపోలేదు. ఎండకు సొమ్మసిల్లి పోయాడు మీలో ఎవరైనా తోడేస్తే ఇతడిని ఇంటికి చేర్చవచ్చు" అన్నాడు అతడిపై సానుభూతి కురిపిస్తూ..

ఆ ఆటోవాడు ఎవరోకాదు ఇదివరలో నన్ను మోసం చేసి వంద రూపాయలు

గుంజుకెళ్లిన వ్యక్తే. సీను అర్థమైపోయింది.

గభాలున వెళ్లి ముసలాడి రెక్కపుచ్చుకుని "రాస్కెల్, ఇంత వయసొచ్చి డబ్బు కోసం వెధవ్వేషాలు వేయడానికి సిగ్గు లేదూ!.. ఇంతకంటే అడుక్కోవడం మంచిది" అన్నాను కసిగా.

"క్షమించండి అదుగో ఆ ఆటోవాడే నా చేత ఈ నాటకం ఆడిస్తున్నాడు. బుద్ధి గడ్డి తిని వాడిమాటలు విని ఇలా నాటకం ఆడాను. నన్ను వదిలిపెట్టండి ఇంకెప్పుడూ ఇలాంటి వేషాలు వెయ్యను బుద్ధొచ్చింది" అంటూ లెంపలేసుకున్నాడు వృద్ధుడు.

అంతా నా వంక వింతగా చూసారు.

నా గత అనుభవాన్ని వాళ్లకు వివరించాను.

"హవ్వ!" అనుకుంటూ అంతా ముక్కుమీద వేలేసుకున్నారు.

"దీని కంతటికి సూత్రధారి ఆ ఆటోవాడే ముందు వాడిని పట్టుకోండి" అన్నాను.

ఇంకెక్కడ ఆటో వాడు? మాటల్లో ఎప్పుడో తుర్రుమన్నాడు.

ఏది ఏమైతేనేం ఆ దెబ్బతో మళ్ళీ వాళిద్దరూ కనిపిస్తే ఒట్టు.

(ఆగస్టు 06, 2008 "నవ్య" వారపత్రిక)

